


EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శనివారం
06 జులై 2024
పేజీలు: 02









# రేపటి నుంచే ఆషాఢ బోనాలు

## జులై 7నుంచి ఆగస్టు వరకు ఉత్సవాలు.. ఆగస్టు 4న గోల్కొండ అమ్మవార్లకు చివరి బోనం

ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు భాగ్యనగరంలో బోనాల సందడి మొదలవుతుంది. అమ్మ బైలెల్లినాదే అంటూ అమ్మవారికి భక్తులు చీర, సారెలు, నైవేద్యాలతో బోనాలు సమర్పిస్తుంటారు. ప్రతీ ఏడాది లాగే ఈ సారి కూడా హైదరాబాద్‌లో బోనాల జాతరకు సర్వం సిద్ధమైంది. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో బోనాల జాతర షురూ అవుతుంది. రేపట నుంచి అంటే ఆదివారం గోల్కొండ ఖిల్లా నుంచి జాతర ప్రారంభంకానుంది. ఇప్పటికే బోనాల పండుగ కోసం పెద్ద ఎత్తున సర్కార్‌ఏర్పాట్లు చేసింది.గోల్కొండ నుండే రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండుగ మొదలవుతుంది. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రేపు ఒక్కరోజే సమయం ఉండడంతో ఇప్పటికే అన్ని ఏర్పాట్లుపూర్తి అయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని శాఖల సమీక్షతో భారీ ఏర్పాట్లు జరిగాయి. గోల్కొండ తర్వాత సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ మహాకాళి బోనాలను నిర్వహించడం జరుగుతుంది. ఆషాఢ మాసం చివరి రోజున తిరిగి గోల్కొండ కోటలో చివరి బోనంతో పూజలు చేసి ఉత్సవాలను ముగింపు పలుకుతారు.

### బోనాల ఉత్సవాలు ఇలా..

**జులై 7, ఆదివారం**
గోల్కొండ జగదాంబిక బోనాల ప్రారంభం


**జులై 9, మంగళవారం**
బల్కంపేట అమ్మవారి కల్యాణమహోత్సవం

**జులై 21, ఆదివారం**
సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు

**జులై 22, సోమవారం**
ఉజ్జయిని మహంకాళి ఆలయంలో రంగం, భవిష్యవాణి

**జులై28, ఆదివారం**
లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాలు

**జులై 29, సోమవారం**
సింహవాహిని మహంకాళి ఆలయంలో రంగం, భవిష్యవాణి



# చంద్రబాబు, రేవంత్ భేటీపై ఉత్కంఠ

తెలుగు రాష్ట్రాలకు ఇవాళ బిగ్ డే.. విభజన సమస్యలకు చెక్ పడుతుందా? జలాలవాటా నుంచి ఆస్తుల పంపకాల దాకా.. అన్ని కొలిక్కి వస్తాయా..? సీఎంల ఫస్ట్ మీటింగ్‌లో జరిగేదేంటి? అనేది.. తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది.. రెండు రాష్ట్రాల విభజన అంశాలను తేల్చేయడానికి ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో చర్చించబోతున్నారు. ఇదివరకటి ముఖ్యమంత్రుల సమావేశానికి, ఈ సమావేశానికి ఎలాంటి మార్పులు ఉంటాయన్నది ఆసక్తిగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లయిపోయింది. అయినా విభజన చట్టం ప్రకారం జరగాల్సిన.. పంపకాలు మాత్రం పూర్తి కాలేదు. తాజాగా, ఇదే అంశంపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అవుతుండటం తెలుగు రాష్ట్రాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ముందుగా విభజన అంశాలపై చర్చించుకుందామంటూ... తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏపీ సీఎం చంద్రబాబు లేఖ రాయడం.. మళ్లీ రేవంత్ రెడ్డి చర్చించుకుందామంటూ చంద్రబాబుకు లేఖ రాయడం చకచకా జరిగిపోయాయి.. ఇవాళ సాయంత్రం ఆరుగంటలకు ఇరు రాష్ట్రాల సీఎంలు ప్రజాభవన్ లో భేటీ కానున్నారు. ఇరు రాష్ట్రాల హక్కులకు భంగం కలగకుండా.. పెండింగ్ సమస్యలను పరిష్కరించుకోవాలని చంద్రబాబు, రేవంత్ రెడ్డి నిర్ణయించిన నేపథ్యంలో ఈ భేటీపై ఉత్కంఠ నెలకొంది. తొలిసారి విభజన అంశాలపై చర్చించేందుకు ప్రజాభవన్‌లో సాయంత్రం 6గంటలకు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి సమావేశంకానున్నారు.. ఈ సమావేశానికి రెండు రాష్ట్రాల డిప్యూటీ సీఎంలు భట్టి విక్రమార్క, పవన్ కల్యాణ్, ఇరు రాష్ట్రాల్లో సీఎస్‌లు, పలువురు మంత్రులు హాజరుకానున్నారు. ఏపీ నుంచి మంత్రులు అనగాని, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్ హాజరుకానున్నారు.
అధికారుల బృందంలో ఏపీ వైపు నుంచి సీఎస్, ఆర్థిక శాఖ సహా కీలక విభాగాల కార్యదర్శుల హాజరవుతారు.
తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అంశాలు ఇవే..
రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ లో కలుపబడ్డ 7 మండలాలు తిరిగి తెలంగాణలో చేర్చాలి.తెలుగు ప్రజల ఆరాధ్య దైవం తిరుపతి వేంకటేశ్వరస్వామి. తెలంగాణకు కూడా టీ.టీ.డీ. పాలకవర్గంలో ప్రాధాన్యత , టిటిడి దర్శనాలలో
తెలంగాణ స్పెషల్ కోటా డిమాండ్..
కృష్ణా జలాల్లో 811 టీఎంసీల నీటి లభ్యత ఉంది. అంతర్జాతీయ నీటి పంపిణీ సూత్రం ప్రకారం క్యాచ్ మెంట్ ఏరియా నిష్పత్తిలో నీటి పంపకాలు జరగాలి. అదేవిధంగా తెలంగాణకు 558 టీఎంసీ నీటిని కేటాయింపు చేయాలి.
తెలంగాణ విద్యుత్ సంస్థలకు, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు రూ.24,000 కోట్ల బకాయిలు సత్వరమే చెల్లించాలి. దానిలో భాగంగా ఆంధ్రాకు ఏమైనా చెల్లించాల్సి ఉంటే, వాటిని చెల్లించడం జరుగుతుంది.తెలంగాణకు ఓడరేవులు లేవు. అందువల్ల విభజనలో భాగంగా ఆంధ్రాలోని కృష్ణపట్నం, మచిలీపట్నం, గంగవరం పోర్ట్స్ లలో తెలంగాణకు ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ కు తెలంగాణకు కోటా ఇవ్వాలి.

## కత్తులతో వేటాడి.. తమిళనాడు
# బీఎస్పీ అధ్యక్షుడి దారుణ హత్య



తమిళనాడులో దారుణ ఘటన చోటుచేసుకుంది. రాష్ట్ర బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను నడి రోడ్డుపై అతి కిరాతకంగా దుండగులు హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు బీఎస్పీ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ చెన్నై పెరంబూర్‌లో నివసిస్తున్నాడు. ఆయన్ని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి కత్తులతో నరికి హత్య చేశారు. ఇంటి ముందు నిలబడ్డ ఆయన్ని కిరాతకంగా నరికి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడటంతో స్థానికులు గుర్తించి దగ్గర్లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆర్మ్‌స్ట్రాంగ్ మృతిచెందారు. ఆయన పక్కన ఉన్న మరో ఇద్దరిపై కూడా దుండగులు దాడికి తెగబడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన సెంబియ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నిందితులను గుర్తించేందుకు సమీపంలోని సీసీ కెమెరాలను తనిఖీ చేస్తున్నారు. ప్రతీకారం తీర్చుకోవడానికే ఈ హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్‌పై కేసులు ఉన్నాయని.. కొన్ని ముఠాలతో పాత కక్షలు ఉన్నట్లు గుర్తించారు. 2023లో గ్యాంగ్‌స్టర్ అర్కట్ సురేశ్‌ని హత్య చేశారని.. అతని సన్నిహితులే ఆర్మ్‌స్ట్రాంగ్‌ని హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. విచారణ ప్రారంభించామని, ఈ కేసులో ఇప్పటి వరకు 8 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 10 పోలీసు బృందాలు నిందితులను పట్టుకునే పనిలో ఉన్నట్లు వెల్లడించారు. అనుమానం రాకుండా ఉండేందుకు నిందితులు ఫుడ్ డెలివరీ బాయ్స్‌గా వచ్చినట్లు తెలిపారు.



## ధైర్యంగా ఉండండి..
# వైఎస్ జగన్ భరోసా

టీడీపీ నేతల విధ్వంసాలు, అరాచకాలతో ఇబ్బంది పడుతున్న కేడర్‌కు అండగా ఉంటామని వైసీపీ అధినేత జగన్ భరోసా ఇచ్చారు. కొందరు ఊళ్లు వదిలి పక్క రాష్ట్రాల్లో ఉంటున్నట్లు పార్టీ నేతలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని జగన్ చెప్పారు. అలాగే భవిష్యత్ కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం చేశారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్ రెడ్డి సహా పలువురు జగన్‌ను కలిశారు.

## అనంత్‌రాధికల పెళ్లి వేడుక..
# హాట్‌స్టార్‌లో లైవ్

పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ- రాధిక మర్చంట్‌ల వివాహం ఈనెల 12న జరగనుంది. ఈ వేడుక లైవ్ స్ట్రీమింగ్ హక్కులను హాట్‌స్టార్ దక్కించుకుంది. జులై 12న 'శుభ్ వివాహ్'తో వేడుక ప్రారంభం కానుంది. 13న శుభ్ ఆశీర్వాద్, 14న మంగళ్ ఉత్సవ్‌తో కార్యక్రమాలు ముగియనున్నాయి. ఈ సంబరాలను హాట్‌స్టార్‌లో లైవ్‌లో వీక్షించొచ్చని ఆ సంస్థ తెలిపింది. ఇప్పటికే సంగీత్ కార్యక్రమం గ్రాండ్‌గా ముగిసింది.






## హెచ్ఐవీ కలకలం..
# 47 మంది విద్యార్థులు మృతి

త్రిపురలో ఇప్పటివరకు హెచ్ఐవీతో 47 మంది విద్యార్థులు మరణించారు. 828 మంది విద్యార్థులకు హెచ్ఐవీ పాజిటివ్‌గా గుర్తించినట్లు TCACS అధికారి తెలిపారు. ప్రతి రోజూ 5-7 కొత్త కేసులు నమోదవుతున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తంగా హెచ్ఐవీతో బాధపడుతున్నవారి సంఖ్య 5,674గా ఉందన్నారు. సంపన్న కుటుంబాల పిల్లలు ఈ మహమ్మారి బారిన పడుతున్నారని, కేసుల పెరుగుదలకు మాదకద్రవ్యాల దుర్వినియోగమే కారణమని తెలిపారు.



## ‘పంచాయితీ’ తీర్చిన గేదె

ఇద్దరు వ్యక్తుల పంచాయితీని గేదె సులువుగా తీర్చేసిన ఘటన యూపీలోని ప్రతాప్‌గఢ్‌లో జరిగింది. నందలాల్‌కు చెందిన గేదె తప్పిపోగా, దాన్ని హనుమాన్ అనే వ్యక్తి తన ఇంట్లో కట్టేసి తిరిగిచ్చేందుకు నిరాకరించాడు. ఈ వివాదంపై పోలీసులు పంచాయితీ చేసినా ఫలితం దక్కలేదు. దీంతో ఇరువురూ రోడ్డుకు చెరో వైపు వెళ్లాలని, గేదె ఎవరిని అనుసరిస్తే వారికే సొంతమని ఎస్‌హెచ్‌ఓ చెప్పారు. అది యజమాని నందలాల్‌కు వైపే వెళ్లడంతో కేసు క్లోజైంది.

## టిల్లు సలహాలు పాటిస్తున్న పూజా హెగ్డే

ఐ హ్యావ్ ఒన్ సజెషన్ ఫర్ యు... అని సిద్ధు జొన్నలగడ్డ చెప్పిన మాటలను సీరియస్‌గా తీసుకున్నారు నటి పూజా హెగ్డే. అయితే సిద్ధు ఆ సజెషన్ ఇచ్చినప్పుడు అక్కడెక్కడో మంచు కొండల్లో ఉన్నారు. కానీ తానెక్కడుంటే అక్కడే ఆ మాటను ఇంప్లిమెంట్ చేస్తున్నారు నటి పూజా హెగ్డే. ఇంతకీ సిద్ధు ఏమన్నారు? పూజా ఏం చేస్తున్నారు? విన్నారుగా అదీ సంగతి... అలా వెళ్లి చిల్ అవ్వండి అని. ఐ హ్యావ్ ఒన్ సజెషన్ ఫర్ యు... అని సిద్ధు చెప్పిన మాటలను సీరియస్‌గా తీసుకున్నారు నటి పూజా హెగ్డే. అయితే సిద్ధు ఆ సజెషన్ ఇచ్చినప్పుడు అక్కడెక్కడో మంచు కొండల్లో ఉన్నారు. కానీ తానెక్కడుంటే అక్కడే ఆ మాటను ఇంప్లిమెంట్ చేస్తున్నారు నటి పూజా హెగ్డే. ఇంతకీ సిద్ధు ఏమన్నారు? పూజా ఏం చేస్తున్నారు? విన్నారుగా అదీ సంగతి... అలా వెళ్లి చిల్ అవ్వండి అని.అయితే ఈ వెర్షన్‌నే తనదైన స్టైల్‌లో ఇంప్లిమెంట్ చేసేస్తున్నారు బ్యూటీఫుల్ పూజా హెగ్డే. నచ్చినంత సేపు పడుకోవడం, ఉన్న చోట గెంతులేయడం, టోగ్రాఫర్ చెయిర్‌ని కబ్జా చేయడం..ఒకటేంటీ? పూజా అల్లరిని చూసి ఫిదా అవుతున్నారు నెటిజన్లు. చోటా చోటా సరదాలు లేకుంటే లైఫ్ ఏం బావుంటుందంటూ కొంటెగా కన్నుగీటుతున్నారు.



## కుర్రాళ్లకు తొలి పరీక్ష

# ఇండియా vs జింబాబ్వే టీ20 సిరీస్

### నేడు సాయంత్రం 4.30 నుంచి సోని స్పోర్ట్స్ లో

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా వంటి దిగ్గజాలు పొట్టి ఫార్మాట్‌కు గుడ్ బై పలకగా ప్రపంచకప్ గెలిచిన సీనియర్ జట్టు సభ్యుల గైర్హాజరీలో జింబాబ్వే పర్యటనకు వెళ్లిన ‘యువ భారత్’కు శనివారం నుంచి ‘తొలి పరీక్ష’ ఎదురుకానుంది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలో ‘జనరేషన్ జెడ్ కిడ్స్’కు భావి భారత స్టార్లుగా ఎదగడానికి ఇదే సువర్ణావకాశం. 2026 టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని సీనియర్ల స్థానాలను భర్తీ చేసే పనిలో ఉన్న బీసీసీఐని కుర్రాళ్లు ఏ మేరకు మెప్పిస్తారనేది ఆసక్తికరం.



టీ20 ప్రపంచకప్ గెలిచిన మధుర క్షణాలు, అభిమాన జనసంద్రాన్ని తలపించిన విజయయాత్ర తాలూకు ఉత్సాహం ఇంకా కండ్ల ముందు మెదులుతుండగానే భారత క్రికెట్ అభిమానులను అలరించేందుకు మరో ద్వైపాక్షిక సిరీస్ సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడేందుకు జింబాబ్వే వెళ్లిన యువ భారత్‌కు శనివారమే తొలి పరీక్ష ఎదురుకానుంది. ఐపీఎల్‌లో అదరగొట్టిన కుర్రాళ్లతో పాటు ఇది వరకే భారత జట్టుకు అడపాదడపా ఆడిన పలువురు నవతరం క్రికెటర్లు సత్తా చాటేందుకు ఇది సదావకాశం. శుభ్‌మన్ గిల్ సారథ్యంలో బరిలోకి దిగనున్న భారత్.. ఈ సిరీస్‌తోనే తదుపరి పొట్టి ప్రపంచకప్ సన్నాహకాలనూ మొదలపెట్టనుంది. సుమారు 15 ఏండ్లుగా భారత జట్టు బ్యాటింగ్ భారాన్ని మోసిన రోహిత్, కోహ్లీ (రోకో) టీ20 ఫార్మాట్‌కు గుడ్‌బై పలికిన నేపథ్యంలో వారి స్థానాలను భర్తీ చేసే ఆటగాళ్ల వేట సైతం ఈ సిరీస్‌తోనూ మొదలుకానుంది.

**కుర్రాళ్లకు గోల్డెన్ చాన్స్..**

ఐపీఎల్‌లో అదరగొట్టిన అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్, తుషార్ దేశ్‌పాండే, హర్షిత్ రాణాకు తొలిసారి జాతీయ జట్టు నుంచి పిలుపు అందగా వీరిలో తుషార్ మినహా మిగిలినవారంతా అరంగేట్రం చేసే అవకాశముంది. గిల్ తన చిన్ననాటి స్నేహితుడైన అభిషేక్‌తో ఓపెనింగ్ చేయనుండటంతో మెరుపు ఆరంభాలు ఖాయంగా కనిపిస్తోంది. మూడో స్థానంలో రుతురాజ్, ఆ తర్వాత రియాన్ పరాగ్, రింకూ సింగ్ వంటి హిట్టర్లతో టీమ్‌ఇండియా బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉంది. జితేశ్ శర్మ ఉన్నా ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉండటం, స్పిన్ ఆల్‌రౌండర్ కోటాలో వాషింగ్టన్ సుందర్ సైతం ఉండటంతో 8వ స్థానం దాకా బ్యాటర్లు అందుబాటులో ఉన్నారు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా బిష్ణోయ్ ఉండగా పేసర్లుగా అవేశ్‌కు తోడుగా ఎవర్ని ఆడిస్తారనేది తేలాల్సి ఉంది. ఖలీల్, ముఖేశ్ రూపంలో భారత్‌కు మెరుగైన ఆప్షన్స్ ఉన్నాయి. ఈ సిరీస్‌లో మెరిస్తే కుర్రాళ్ల పంట పండినట్టే!

**టీ0 సిరీస్ షెడ్యూల్**

- తొలి టీ20 - జులై 6
- రెండో టీ20 - జులై 7
- మూడో టీ20 - జులై 10
- నాల్గో టీ20 - జులై 13
- ఐదో టీ20 - జులై 14

**జట్ల అంచనా:**

ఇండియా: గిల్(కెప్టెన్), అభిషేక్, రుతురాజ్, రియాన్‌పరాగ్, రింకూసింగ్, జురెల్/జితేశ్, సుందర్, బిష్ణోయ్, అవేశ్‌ఖాన్, తుషార్‌దేశ్‌పాండే, ఖలీల్.

జింబాబ్వే: సికిందర్(కెప్టెన్), బెన్నెట్, మరుమని, క్యాంప్‌బెల్, నక్వి, క్లైవ్ మదాండె, మాదెవెరె, లూక్ జోంగె, ఫరాజ్ అక్రమ్, మసకద్జ, ముజర్‌బనీ.


## టిప్పర్‌ను ఢీకొట్టిన కారు.. నలుగురు దుర్మరణం

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాలో జరిగిన రోడ్డుప్రమాదంలో నలుగురు యువకులు మృతిచెందారు. శనివారం తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా రామాపురం మండలం కొండవాండ్లపల్లి వద్ద కారు అదుపుతప్పి టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుడిని రాయచోటి దవాఖానకు తరలించారు.ప్రమాద సమయంలో కారులో ఐదుగురు ప్రయాణిస్తున్నారని చెప్పారు. మృతులను అంజినాయక్ (29), షేక్ అలీమ్ (32), జితేంద్ర (22), షేక్ అఫ్రోజ్ (30) గా గుర్తించారు. షేక్ ఖాదర్ బాషా (20) అనే యువకుడు గాయపడ్డాడని, అతని పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. వీరంతా కడప జిల్లాకు చెందినవారని తెలిపారు. ప్రమాద ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.




**మరో ప్రమాదంలో ముగ్గురు**

మహబూబాబాద్ జిల్లాలోని దంతాలపల్లి శివారులో కారు, ఆటో ఢీకొన్నాయి. దీంతో ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతులను మల్లేశ్, కుమార్, నరేశ్‌గా గుర్తించారు. గాయపడినవారిని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు.



## గూగుల్ మ్యాప్స్‌కు ప్రత్యామ్నాయంగా ‘ఓలా మ్యాప్స్’

గూగుల్ మ్యాప్స్‌కు ప్రత్యామ్నాయంగా ‘ఓలా మ్యాప్స్’ తీసుకొస్తున్నట్లు ఆ సంస్థ సీఈఓ భావిశ్ అగర్వాల్ ప్రకటించారు. గతంలో మ్యాప్స్ కోసం ఏడాదికి ₹100కోట్లు వెచ్చించేవాళ్లమని, ఇక నుంచి ఆ ఖర్చు ఉండదని చెప్పుకొచ్చారు. ఓలా యాప్ యూజర్లు వెంటనే యాప్ అప్డేట్ చేసుకోవాలని కోరారు. ఈ మ్యాప్స్‌లో స్ట్రీట్ వ్యూ, ఇండోర్ ఇమేజ్‌లు, 3డీ మ్యాప్‌లు, డ్రోన్ మ్యాప్‌లు మొదలైన ఫీచర్స్ త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు

## జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశం రసాభాస..

# పోడియంను చుట్టుముట్టిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు



జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. కౌన్సిల్ సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టారు. మేయర్ గద్వాల విజయలక్ష్మికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. పలువురు కార్పొరేటర్లు మేయర్‌తో వాగ్వాదానికి దిగారు. వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీంతో సమావేశ మందిరంలో గందరగోళం నెలకొన్నది. దీంతో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లపై మేయర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్పొరేటర్లను తమ స్థానాల్లో కూర్చోవాలని సభ్యులను కోరినప్పటికీ వారు వినకపోవడంతో సమావేశాన్ని 15 నిమిషాలపాటు వాయిదా వేశారు. తిరిగి సమావేశం ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పురాలేదు. బీఆర్‌ఎస్ సభ్యులు మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండటంతో ఆమె తన సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. కాగా, ఇనాళ్లు బీఆర్‌ఎస్‌లో కొనసాగిన మేయర్, డిప్యూటీ మేయర్.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పార్టీలో చేరారు. వారితోపాటు పలువురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో సభలో విచిత్ర పరిస్థితి నెలకొంది. గడిచిన కొన్ని నెలలుగా జంపింగ్ జపాంగ్‌లు ఉన్నప్పటికీ బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులతో నేటికీ బీఆర్‌ఎస్ మాత్రమే బలంగా ఉంది. 150 మంది కార్పొరేటర్లలో ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా కాగా, మరో ఇద్దరు ఎర్రగడ్డ, గుడిమల్కాపూర్ కార్పొరేటర్లు చనిపోయారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు 47 మందితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. ఇక ఎంఐఎం 41, బీజేపీ 39, కాంగ్రెస్ 19 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. కాగా, మేయర్‌పై బీఆర్‌ఎస్ పార్టీ అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టనున్నది.



## అమర్‌నాథ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్

అమర్‌నాథ్ యాత్ర ఇటీవలే ప్రారంభమైన విషయం తెలిసిందే. జమ్మూకశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలోని ఎత్తయిన గుహలో సహజసిద్ధంగా ఏర్పడే మంచు శివలింగాన్ని దర్శించుకునేందుకు భక్తులు తరలివెళ్తున్నారు. అయితే, తాజాగా ఈ యాత్రకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ప్రస్తుతం అక్కడ భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు శనివారం ప్రకటించారు. బాల్తాల్, పహల్గాం మార్గాల్లో గత రాత్రి నుంచి వర్షాలు కురుస్తుండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా యాత్రికుల భద్రత నిమిత్తం ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రెండు మార్గాల్లోనూ యాత్రను నిలిపివేసినట్టు స్పష్టం చేశారు. ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర జూన్ 29న ప్రారంభమైన విషయం తెలిసిందే. 3,800 మీటర్ల ఎత్తులో సహజసిద్ధంగా ఏర్పడిన మంచు లింగాన్ని దర్శించుకునేందుకు ఏటా లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు.